సాక్షి
నల్లగొండ
శనివారం ၊ 5 ၊ ఆగస్టు ၊ 2023



'సమీకృతం'పై దృష్టి సారించాలి

రైతులు సమీకృత సాగుపై దృష్టి సారించాలని పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రం హెడ్ మల్లారెడ్డి సూచించారు.

- 10లో



పిలిచి అవమానపరిచారని..

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జానపద, భజన, కోలాటం కళాకారులు ఆందోళనకు దిగారు.

- 10లో

గరిష్ఠం/కనిష్ఠం
33°/25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం

రామగిరి(నల్లగొండ) : ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రతి పోస్టాఫీస్‌లో జాతీయ జెండాలను విక్రయించనున్నట్లు నల్లగొండ పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కె.రఘునాథస్వామి తెలిపారు. జాతీయ జెండా కావాల్సిన వారు పోస్టాఫీస్‌కు వెళ్లి రూ.25 చెల్లించి జెండాను పొందవచ్చని పేర్కొన్నారు. www.epostoffice.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆగస్టు 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి పోస్ట్‌మెన్ ద్వారా జెండాను ఇంటికి డెలివరీ చేస్తామని తెలిపారు.

పంటల వివరాలు నమోదు చేయాలి



రైతులకు సూచనలిస్తున్న డీఏఓ సుచరిత

మిర్యాలగూడ : రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఏఈఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి సుచరిత అన్నారు. శుక్రవారం దామరచర్ల మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో వానాకాలం సీజన్ పంటల నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పంటల వివరాలను గ్రామానికి సంబంధించిన ఏఈఓల వద్ద తప్పకుండా నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. రైతుబీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ కల్యాణ్‌చక్రవర్తి, ఏఈఓ ప్రియాంక, ధనావత్ బాలు, రైతులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఓకు మెమో

నల్లగొండ : గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు, హరితహారం తదితర పనుల విషయంలో లక్ష్యాన్ని పూర్తి చేయకపోవడంతో డీఆర్‌డీఓ కాళిందినికి కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ శుక్రవారం మెమో జారీ చేశారు. జిల్లాలో క్రీడా మైదానాలకు సంబంధించి ప్రభుత్వానికి పంపిన నివేదిక ప్రకారం క్షేత్రస్థాయిలో నిర్మాణం కాలేదు. దానికితోడు హరితహారం విషయంలోనూ టార్గెట్‌ను చేరుకోకపోవడంతో డీఆర్‌డీఓ తీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. క్రీడా మైదానాలు, వైకుంఠ ధామాలు, ఉపాధి హామీతో మిళితమైన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, డీపీఓ, జెడ్పీ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే పనుల్లో జాప్యం చోటు చేసుకుందని.. వారం రోజుల్లో పనులు పురోగతిలోకి రావాలని ఆదేశించినట్లు తెలిసింది.

అవిశ్వాస సమావేశం వాయిదా

మర్రిగూడ : ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై అవిశ్వాసం కోరుతూ గత నెల 10న మర్రిగూడ మండలంలోని 8 మంది ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములుకు అందజేశారు. దీంతో ఈ నెల 5న అసమ్మతి సమావేశం నిర్వహించనున్నట్లు, హాజరుకావాల్సిందిగా ఎంపీపీతోపాటు పది మంది ఎంపీటీసీలకు నోటీసులు అందజేశారు. కాగా ఇటీవల అవిశ్వాసాన్ని సవాలు చేస్తూ ఎంపీపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 9 వరకు అవిశ్వాసం వాయిదా వేస్తున్నట్లు కోర్టు స్టే ఇచ్చింది. కోర్టు తీర్పు ప్రకారం శనివారం జరగాల్సిన అవిశ్వాస సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆర్డీఓ శ్రీరాములు ఆదేశాల మేరకు ఎంపీపీతోపాటు 10 మంది ఎంపీటీసీలకు సమాచారం అందజేసినట్లు ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

పింఛన్ పంపిణీలో బీపీఎంల చేతి వాటం !

చండూరు : పేదలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పథకం ద్వారా నెలనెలా పింఛన్ అందిస్తోంది. అయితే అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా బ్రాంచి పోస్ట్‌మాస్టర్లు (బీపీఎం) సంపాదనకు మరిగారు. చండూరు, గట్టుప్పల్ మండలాల పరిధిలో 5,359 మంది ఆసరా పింఛన్ లబ్ధిదారులకు పోస్టాఫీసుల ద్వారా బీపీఎంలు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. ఒంటరి స్త్రీలు, వృద్ధులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, వితంతువులకు ప్రతినెలా రూ.2,016, అంగ వైకల్యం కలిగిన వారికి రూ.3,016 అందజేయాల్సి ఉంటుంది. రెండు మండలాల పరిధిలో అనేక గ్రామాల్లో బీపీఎంలు చిల్లర లేవనే సాకుతో ప్రతి లబ్ధిదారుడికి రూ.16 ఇవ్వకుండా చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. అనేక నెలలుగా ఇదే తంతు కొనసాగుతోంది. ఈ విషయం పై ఎంపీడీఓ యాకూబ్ నాయక్‌ను వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

వీఆర్‌ఏల సర్దుబాటు

రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, మిషన్ భగీరథకు కేటాయింపు

- 186 మంది జూనియర్ అసిస్టెంట్లుగా..
- 815 మంది సూపర్ న్యూమరీ పోస్టుల్లో నియామకం
- ఎవరెవరికి ఏశాఖ అనేది రాష్ట్ర స్థాయిలోనే నిర్ణయం
- పూర్తిగా రద్దయిన వీఆర్‌ఏ వ్యవస్థ



కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

నల్లగొండ: ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి వారి వివిధ ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేసింది. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖలు, మిషన్ భగీరథకు వారిని కేటాయించింది. వారి విద్యార్హతను బట్టి జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు, చైన్‌మెన్‌లు, లస్కర్, హెల్పర్లుగా నియమించింది. 186 మందిని రెవెన్యూ, మున్సిపల్ శాఖల్లో ఖాళీల ఆధారంగా జూనియర్ అసిస్టెంట్లుగా కేటాయించగా.. మిగతా 815 మందిని సూపర్ న్యూమరీ పోస్టుల్లో నియమించింది.

జిల్లాలో 1001 మంది వీఆర్‌ఏలు

జిల్లాలో 1001 మంది వీఆర్‌ఏలు పని చేస్తున్నారు. అందులో డిగ్రీ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్లుగా అవకాశం కల్పించారు. ఇంటర్ చదివిన వారికి రికార్డు అసిస్టెంట్లుగా, 10వ తరగతి చదివిన వారికి ఆఫీస్ సబార్డినేట్, చైన్‌మెన్, 7వ తరగతి వరకు చదువుకున్న వారిని లస్కర్‌లు, ఇంకా తక్కువ చదువుకున్న వారిని హెల్పర్లుగా కేటాయించారు. రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో జూనియర్ అసిస్టెంట్లుగా 124 మందిని తీసుకోగా, మున్సిపాలిటీల్లో జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లుగా 62 మందిని తీసుకున్నారు. వీరికి రూ.24,280 నుంచి 72,850 పే స్కేల్ నిర్ణయించారు.

815 మందిని సూపర్ న్యూమరీ పోస్టుల్లో..

మొత్తం 1001 మంది వీఆర్‌ఏలకు గాను 186 మందిని మున్సిపల్, రెవెన్యూ శాఖలోకి తీసుకోగా.. ఆయా శాఖల్లో ఖాళీలు లేకపోవడంతో 815 మందిని సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేసి భర్తీ చేశారు. అందులో రెవెన్యూ శాఖలో రికార్డు అసిస్టెంట్లుగా 88 మందిని నియమించి వారికి రూ.22,240 నుంచి రూ.67,300 వేతనం నిర్ణయించారు. రెవెన్యూ శాఖలోనే చైన్‌మెన్‌గా 23 మందిని, ఇరిగేషన్ శాఖలో 421 మందిని, లస్కర్లుగా 91 మందిని హెల్పర్లుగా, మిషన్ భగీరథలో 192 మందిని హెల్పర్లుగా కేటాయించారు. వారికి రూ.19,000 నుంచి రూ.58,850 వేతనం నిర్ణయించారు.

రాష్ట్రస్థాయిలోనే నిర్ణయం..

ప్రస్తుతం ప్రభుత్వం వీఆర్‌ఏలను ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో కేటాయించడంతోపాటు వివిధ శాఖల్లో సూపర్ న్యూమరీ పోస్టులను క్రియేట్ చేసి వారిని ఆ పోస్టులకు అలాట్ చేసింది. అయితే అందులో ఎవరెవరు ఏఏ శాఖలకు పోతారన్నది సీసీఎల్ఏ స్థాయిలోనే నిర్ణయం తీసుకోనున్నారు. సీనియారిటీ ఆధారంగానా లేక చదువును బట్టి శాఖలకు కేటాయిస్తారా అనేది తెలియని పరిస్థితి. ఎవరు ఏ శాఖలోకి అనేది రాష్ట్రస్థాయి నుంచే కేటాయింపు చేయనున్నారు.

ముగిసిన వీఆర్‌ఏ వ్యవస్థ..

ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను సమూలంగా మార్పు చేస్తూ వచ్చింది. అందులో భాగంగా మొదటి విడత వీఆర్‌ఓ వ్యవస్థను రద్దు చేసి వారందరినీ వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. ఆ తర్వాత వీఆర్‌ఏ వ్యవస్థను కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం వారిని కూడా రెవెన్యూ, తదితర శాఖల్లో సర్దుబాటు చేసింది. దీంతో రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏ వ్యవస్థ కూడా రద్దయింది.

ఐటీ టవర్ పనులు పూర్తి చేయాలి



చర్లపల్లిలో అర్బన్ పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలో ఐటీ టవర్ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నల్లగొండలోని ఐటీ టవర్ పనులను ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐటీ టవర్‌లో మౌలిక సదుపాయాలు, నీటి సౌకర్యం, విద్యుత్, ఇంటర్నెట్ కనెక్షన్లు, బస్‌బే, పాలిటెక్నిక్ కళాశాల వరకు కెనాల్ సుందరీకరణ చేయాలని సూచించారు. సెప్టెంబర్ రెండో వారం నాటికి అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. చర్లపల్లిలో అర్బన్ పార్కులో ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటాలని, నీరు నిలిచే చోట నీటి కొలను మాదిరిగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మర్రిగూడ బైపాస్‌లో జంక్షన్ వద్ద ఫ్లెటైవర్ బ్రిడ్జి బడ్జెట్, ఎప్పుడు పూర్తవుతుంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని నిరాశ్రయుల భవనాన్ని పరిశీలించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మున్సిపల్ కమిషనర్ కెవి.రమణాచారి, ప్రజారోగ్య శాఖ ఈఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ టౌన్ : వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఆయన వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్లు, అంగన్‌వాడీ సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జ్వరం కేసులు వచ్చిన వారికి డెంగీ రాపిడ్ టెస్ట్ కిట్‌తో రక్తపరీక్ష చేయాలన్నారు. దీనిపై ప్రతి వారం పీహెచ్‌సీలు రిపోర్ట్ ఇవ్వాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందుల కిట్ అన్ని పీహెచ్‌సీలలో అందుబాటులో ఉండాలన్నారు. వైద్య కళాశాలలో అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ లచ్చునాయక్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ కోర్సులు రెగ్యులర్‌తో సమానం

- డీఈఓ భిక్షపతి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ

నల్లగొండ : ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ కోర్సులు రెగ్యులర్ విద్యతో సమానమని, ఈ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కూడా పొందవచ్చని డీఈఓ భిక్షపతి పేర్కొన్నారు. శుక్రవారం ఓపెన్ స్కూల్ నూతన అడ్మిషన్లకు సంబంధించి కోఆర్డినేటర్లకు నల్లగొండలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యాసకులు తప్పకుండా పర్సనల్ కాంటాక్టు తరగతులకు హాజరు కావాలని, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్లు తమ మండలంలోని అన్ని డిపార్టుమెంట్ల సహకారంతో అడ్మిషన్లు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ జె.జగదీష్‌కుమార్, స్టడీ సెంటర్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఊంజలి సేవ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాళ్ అమ్మవారి ఊంజలి సేవోత్సవాన్ని ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో ఊంజలి సేవోత్సవం జరిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి ఆచార్యులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవోత్సవాల్లో భక్తులు పాల్గొన్నారు.

మూసీకి తగ్గిన వరద



మూసీ గేట్ల నుంచి దిగువకు పోతున్న నీరు

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి శుక్రవారం తగ్గింది. వచ్చిన నీటిని రెండు గేట్ల క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. మూసీ ప్రాజెక్టుకు గురువారం రాత్రి 5,427 క్యూసెక్కులుగా ఇన్‌ఫ్లోరాగా.. శుక్రవారం 1,822 క్యూసెక్కులకు తగ్గింది. దీంతో గురువారం రాత్రి తెరిచి ఉంచిన మూడు క్రస్టు గేట్లలో ఒక గేటును అధికారులు పూర్తిగా మూసి వేశారు. రెండు క్రస్టు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి ఉంచి 1,262 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి వదిలారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా 560 క్యూసెక్కులు వదులుతున్నారు. మూసీ ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం 645(4.46 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి నీటిమట్టం 642.70 అడుగులు(3.86 టీఎంసీలు)గా ఉందని అధికారులు తెలిపారు.

ప్రమాదాల నివారణకు వాహనాల తనిఖీ

నల్లగొండ క్రైం : రోడ్డు ప్రమాదాల నివారణకు నిత్యం వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు ఎస్పీ అపూర్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై నెలలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 507 మంది పట్టుబడగా 14 మందికి జైల్ శిక్ష పడినట్లు పేర్కొన్నారు. వీరిలో ఆరుగురికి ఒక్క రోజు, ఒకరికి రెండు రోజులు, ఏడుగురికి వారం రోజుల జైలు శిక్ష పడినట్లు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల ద్వారా రూ.6,26,706 జరిమానా విధించినట్లు తెలిపారు. వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సురక్షితంగా గమ్య స్థానానికి చేరుతారని తెలిపారు.

డీలర్లకు 'తూకం' చిక్కు

- అమలుకాని ప్రభుత్వ ఆదేశాలు
- తూకం వేయకుండానే రేషన్ బియ్యం ఇస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు
- తరుగు వస్తుండడంతో నష్టపోతున్నామని డీలర్ల ఆవేదన



నల్లగొండ : రేషన్ డీలర్లకు కొత్త చిక్కు వచ్చి పడింది. తాము ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా అది పరిష్కారం కాకపోగా కొత్తగా మరో సమస్య వచ్చింది. పేదల కోసం ప్రతినెలా మండల లెవెల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరఫరా చేస్తున్న బియ్యం తక్కువ తూకం వస్తున్నాయని, దీంతో తాము ఏళ్ల తరబడిగా నష్టపోతున్నామని, బియ్యం తూకం వేసి ఇవ్వాలని డీలర్లు కొంతకాలంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. ఎట్టకేలకు డీలర్ల విన్నపంపై స్పందించిన ప్రభుత్వం జూలై నుంచి తూకం వేసి ఇవ్వాలని ఈ ఏడాది జూన్ చివరలో ఆదేశాలు జారీ చేసింది. కానీ ఎంఎల్ఎస్ పాయింట్లలో వేయింగ్ మిషన్లు పెద్దవి లేకపోవడంతో తూకం వేయకుండానే బస్తాల ప్రతిపాదికనే లెక్కగట్టి పాత పద్ధతిలోనే డీలర్లకు ఇస్తున్నారు. దీంతో సమస్య పరిష్కారం కాలేదని డీలర్లు వాపోతున్నారు. పైగా ఇప్పుడిస్తున్న బియ్యం కోసం ప్రతి డీలర్ గోదాముకు వెళ్లి థంబ్ వేయాలని నిబంధన విధించడంతో గత సమస్య పరిష్కారం కాకపోగా కొత్త సమస్య వచ్చి పడిందని డీలర్లు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో రేషన్ షాపులు	991
ఆహార భద్రతాకార్డులు	4,66,529
లబ్ధిదారులు	13,96,933

తూకం వేసే యంత్రాలు లేక..

ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ప్రతినెలా రేషన్ షాపులకు బియ్యం పంపిణీ అవుతుంటాయి. అయితే ఆ బియ్యాన్ని గోదాముల వద్ద ఏ డీలర్‌కు ఎన్ని కింటాళ్లు ఇవ్వాలనేది తూకం వేసి ఇవ్వాలి. అందుకోసం అక్కడ ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలను కూడా ఏర్పాటు చేశారు. కానీ ఆ యంత్రాలు 25 కింటాళ్ల వరకే తూకం వేయడానికి అనుకూలంగా ఉండడంతో ఒక్కో డీలర్‌కు 2, 3 సార్లు తూకం వేయాల్సి వస్తోంది. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న సాకుతో 50 కిలోల బస్తాలనే లెక్కగట్టి డీలర్లకు బియ్యం పంపుతున్నారు. అయితే మొదట బయట తూకం వేసుకునేందుకు అవకాశం ఇచ్చినా అది సాధ్యం కాకపోవడంతో పాత పద్ధతిలోనే బియ్యం పంపుతున్నారు. పైగా పౌరసరఫరాల అధికారులు బఫర్ గోదాముల నుంచి బియ్యం తూకం వేసి ఇవ్వడం లేదని మేము కూడా ఇవ్వలేమని ఎంఎల్ఎస్ పాయింట్ల సిబ్బంది చెబుతున్నారు. చిన్న కాంటాలపై తూకం వేయడం సాధ్యం కాదని, హమాలీలకు కూడా ఇబ్బందులు అవుతాయన్న సాకుతో తూకం వేయడంలేదు. కానీ, డీలర్లతో మాత్రం థంబ్ వేయించుకుంటూ బియ్యం ఇస్తున్నారు.

155 వైన్స్‌లకు నోటిఫికేషన్

- వివరాలు వెల్లడించిన జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్
- మొదటి రోజు 10 మద్యం దుకాణాలకు దరఖాస్తులు



గెజిట్‌ను విడుదల చేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

నల్లగొండ క్రైం : జిల్లాలో 155 మద్యం దుకాణాల కేటాయింపునకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 18లోపు అన్ని దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. రిజర్వేషన్ ప్రకారం గౌడ్స్‌కు 34, ఎస్సీలకు 14, ఎస్టీలకు 4 చొప్పున దుకాణాలను కేటాయించినట్లు తెలిపారు. 103 మద్యం దుకాణాలు జనరల్ కేటగిరిలో ఉన్నాయని దరఖాస్తు వెంట రూ.2 లక్షల డీడీ, చలాన రూపంలో చెల్లించాలని, దరఖాస్తుదారుడి పాస్‌ఫొటో, ల్యాటరీ సమయంలో వచ్చే వారి ఫొటో, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్స్, రిజర్వేషన్ కేటగిరీ వారు కుల ధ్రువీకరణ పత్రం జతపరచాలని తెలిపారు. అందుబాటులో లేకపోతే కుల ఈనెల 31లోపు ధ్రువీకరణ పత్రం ఇస్తామని తెలుపుతూ అండర్ టేకింగ్ పత్రం ఇవ్వాలని సూచించారు. 21 సంవత్సరాలు పైబడిన వారు మాత్రమే మద్యం షాపుల దరఖాస్తుకు అర్హులను పేర్కొన్నారు. కోర్టు కేసుల్లో శిక్ష పడినవారు ప్రభుత్వానికి ఏ సమయంలోనైనా బకాయిలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులని పేర్కొన్నారు. ఒక అభ్యర్థి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చని, లాటరీలో టెండర్ దక్కిన దుకాణాలన్నీ అప్పగిస్తామన్నారు. టెండర్ పొందిన అభ్యర్థి ఈనెల 22న వార్షిక లైసెన్స్ ఫీజులో 6వ వంతు చెల్లించాలన్నారు. దరఖాస్తుదారులకు మరింత సమాచారం కోసం నల్లగొండ కార్యాలయం 08682-223271, నల్లగొండ సర్కిల్ సీఐ 9440902631, మిర్యాలగూడ సర్కిల్ సీఐ 9440902644, దేవరకొండ సర్కిల్ సీఐ 9440902633, నకిరేకల్ సర్కిల్ సీఐ 9440902640, చండూర్ సర్కిల్ సీఐ 970512 7085, నాంపల్లి సర్కిల్ సీఐ 9491595724, హాలియా సర్కిల్ సీఐ 9440902632 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మొదటిరోజు 10 దరఖాస్తులు..

మద్యం టెండర్లకు సంబంధించ మొదటిరోజు 10 దరఖాస్తులు వచ్చాయి. నల్లగొండ సర్కిల్‌లో 40 దుకాణాలకు ఆరు, నాంపల్లి సర్కిల్‌లో 16 దుకాణాలకు మూడు, చండూర్ సర్కిల్‌లో 14 దుకాణాలకు ఒక్క దరఖాస్తు అందాయి. ఎన్నికల సమయం కావడంతో భారీగానే దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. దరఖాస్తులు స్వీకరించేందుకు సర్కిల్ వారీగా కార్యాలయంలో అందరికీ తెలిసేలా గదులను కేటాయించారు. మద్యం టెండర్‌కు అవసరమయ్యే పత్రాలను తెలియజేస్తూ గోడపై వివరాలు పొందుపరిచారు.

వంద శాతం వసూలు చేయాల్సిందే!

- విద్యుత్ బిల్లులు 80 శాతం కంటే తక్కువ వసూలు చేసిన వారికి మెమోలు
- సీఎండీ ఆదేశాలతో చర్యలకు పూనుకున్న డీఈలు
- అరకొర సిబ్బందితో ఎలా సాధ్యమంటున్న ఉద్యోగులు
- మెమోలు వెనక్కి తీసుకోవాలని సంఘాల ఆందోళన



డీఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు (ఫైల్)

నల్లగొండ : విద్యుత్ బిల్లుల వసూళ్ల విషయంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై విద్యుత్ శాఖ సీరియస్ అయ్యింది. ఇటీవల సీఎండీ రఘుమారెడ్డి నల్లగొండ జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా విద్యుత్ అధికారుల సమావేశంలో నూటికి నూరు శాతం విద్యుత్ బిల్లులను వసూలు చేయని సిబ్బందికి మెమోలు ఇవ్వాలంటూ జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో జిల్లాలోని నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ డివిజన్ పరిధిలో విద్యుత్ బిల్లులు 80 శాతం కంటే తక్కువగా వసూలు చేసిన 100 మందికి మెమోలు జారీ చేశారు. వారిలో లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు, ఆర్టీజెన్లు ఉన్నారు. అయితే, మెమోలను వెంటనే వెనక్కు తీసుకోవాలని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఆందోళన చేశారు.

సీఎండీ ఆదేశాలతో మెమోలు..

'విద్యుత్ ఇచ్చిన తర్వాతే బిల్లు అడుగుతున్నాం. బిల్లులు వస్తేనే తిరిగి వేతనాలు, ఇతర వాటికి ఖర్చు చేస్తాం. బిల్లులే వసూలు చేయకపోతే వేతనాలు ఎక్కడినుంచి ఇస్తాం. ఎవరైతే విద్యుత్ బిల్లుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తారో వారికి మెమోలు ఇవ్వాలి' అంటూ జిల్లా డీఈలకు సీఎండీ రఘుమారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాల మేరకు డీఈలు సిబ్బందిపై చర్యలకు పూనుకున్నారు.

పెండింగ్ ఇలా..

జిల్లాలో విద్యుత్ బిల్లులు మొత్తం రూ.7 కోట్ల బకాయిలు ఉన్నాయి. అందులో గత నెలకు సంబంధించే రూ.కోటి వరకు బిల్లులు పేరుకుపోయాయి. జూలై నెలకు సంబంధించి రూ.33.59 కోట్ల పైచిలుకు బిల్లులు వసూలు చేయాల్సి ఉండగా రూ.32.63 కోట్ల వరకు వసూలు చేశారు.

ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు..

ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తుంది. దానికి సంబంధించి ప్రభుత్వం ఆలస్యంగా బిల్లులు విడుదల చేస్తుంది. అప్పటివరకు ఆ బిల్లు పెండింగ్‌లోనే ఉంటుంది. ఆ బిల్లును వసూలు చేయొద్దని సిబ్బందికి చెబుతున్నారు. దోబీగాట్లు, ల్యాండ్రీ షాపులు, హెయిర్ సెలూన్‌లకు కూడా ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. వాటికి సంబంధించి కూడా ప్రభుత్వం ఆలస్యంగా విద్యుత్ శాఖకు బిల్లు చెల్లిస్తుంది. నూటికి నూరు శాతం బిల్లులో ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు కూడా ఉంటున్నాయి. అలాంటప్పుడు వంద శాతం బిల్లు వసూలు ఎలా సాధ్యమవుతుందని విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు.

అరకొర సిబ్బందితో ఎలా సాధ్యం..

నిబంధనల ప్రకారం 500 సర్వీస్‌లకు ఒక హెల్పర్ ఉండాలి. 1500 సర్వీస్‌లకు ఒక లైన్‌మెన్ ఉండాలి. కానీ ఒకొక్కరికీ మూడు వేల నుంచి ఐదు వేల వరకు కూడా కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో 17 మంది లైన్‌మెన్లకు వారి కింద పని చేసేందుకు అసిస్టెంట్ లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఆర్టీజన్లు లేరు. అయితే ఆ లైన్‌మెన్ ఒక్కడే విద్యుత్ బిల్లుల వసూళ్లతోపాటు బ్రేక్‌డౌన్‌లు, ఇతర సమస్యలు ఏవి వచ్చినా చూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. అలాంటప్పుడు ఉద్యోగి ఇల్లిల్లూ తిరిగి బిల్లులు వసూలు చేయడం సాధ్యం కావడం లేదు. సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి బిల్లుల వసూలుపై ఒత్తిడి చేయాలి కానీ.. అరకొర సిబ్బందితో వంద శాతం బిల్లులు వసూలు సాధ్యం కాదంటూ సిబ్బంది పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడి మృతి

కనగల్ : రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడు దుర్మరణం చెందాడు. కనగల్ గ్రామం నుంచి జగతయ్య(55) శుక్రవారం బైక్‌పై క్రాస్ రోడ్డు వద్ద ఉన్న తన సిమెంట్ షాపునకు వస్తున్నాడు. ఎదురుగా కనగల్ నుంచి ఎం గౌరారం గ్రామానికి చెందిన గోన శ్రీనివాస్‌రావు ఎరువుల బస్తాలు తీసుకుని నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడపడంతో జగతయ్యను కేజీబీవీ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. జగతయ్య తలకు తీవ్రగాయాలై మృతిచెందాడు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్,బీఆర్ఎస్ నాయకులు ఆయన మృతికి సంతాపం వ్యక్తి చేశారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపాడు.

గాయపడిన వ్యక్తి మృతి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఆత్మకూర్ (ఎస్) మండలం పాతసూర్యాపేటకు చెందిన తాటికొండ వెంకట్‌రెడ్డి (55) ఈనెల 1న బైక్‌పై గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలానికి వెళుతున్నాడు. అదే సమయంలో ఎదురుగా బైక్‌పై వస్తున్న చివ్వెంల మండలం గాయంవారిగూడెం గ్రామానికి చెందిన వీరండి హరి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకట్‌రెడ్డి తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి.. అక్కడి నుంచి ఈనెల 2న మెరుగైన వైద్యం నిమిత్తం నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకట్‌రెడ్డి శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు తాటికొండ సంజీవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

'ఆజాదీకా అమృత్'కు 'రేగట్టె'కు ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): కేంద్ర ప్రభుత్వం 75 వసంతాల ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమానికి నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డికి ఆహ్వానం అందింది. రెండో దశ ఉత్సవాల్లో భాగంగా కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 5,6వ తేదీల్లో ఢిల్లీలో గ్రంథాలయాల వేడుకలు జరగనున్నాయి. ప్రారంభ వేడుకలో ప్రతినిధిగా మల్లికార్జున్‌రెడ్డి పాల్గొననున్నారు. లైబ్రరీల అభివృద్ధి, డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించేందుకు ప్రధాని దృష్టికి అనుగుణంగా ఈ వేడుకలను నిర్వహించనున్నారు. అవకాశం కల్పించిన కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు మల్లికార్జున్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రెండు విద్యుత్ మోటార్లు చోరీ

నడిగూడెం : గుర్తుతెలియని వ్యక్తులు రెండు విద్యుత్ మోటార్లను చోరీ చేశారు. నడిగూడెం మండలం ఎకలాస్‌ఖాన్‌పేట గ్రామ సమీపంలోని చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నడిగూడెం మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన మరెడ్డి కిషోర్‌రెడ్డి, అమ్మనబోయిన లక్ష్మమ్మలకు చెందిన విద్యుత్ మోటార్లు ఎకలాస్‌ఖాన్‌పేట గ్రామ సమీపంలోని కొమరబండ మేజరు కాల్వపై ఉన్నాయి. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ మోటార్లను చోరీ చేశారు. వాటి విలువ రూ.50 వేలకు పైగా ఉంటుందని, శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

నిరుపేదకు ప్రాణభిక్ష పెట్టరూ..

- కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న దివ్యాంగుడు
- వారం రోజుల్లో ఆపరేషన్ చేయకపోతే రెండు కిడ్నీలు తొలగించాల్సిందేనంటున్న వైద్యులు
- వైద్యానికి రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని వెల్లడి
- చేతిలో చిల్లిగవ్వ లేక దాతలను అర్థిస్తున్న అభాగ్యుడు

అసలే పేదరికం.. ఆపై అవిటితనం. పింఛన్ డబ్బులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆ దివ్యాంగుడి జీవితాన్ని మాయదారి రోగం అతలాకుతలం చేసింది. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అతను రోజురోజుకీ క్షీణిస్తున్న ఆరోగ్యంతో నరకయాతన అనుభవిస్తున్నాడు. వారం రోజుల్లో ఆపరేషన్ చేయకపోతే రెండు కిడ్నీలు తొలగించాల్సిందేనని వైద్యులు స్పష్టం చేయడంతో చేతిలో చిల్లిగవ్వ లేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. దాతలు ప్రాణభిక్ష పెట్టాలని అర్థిస్తున్నాడు.

కన్నీటి గాథ

అర్వపల్లి : సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన మేదరి కులస్తురాలైన పెరసాని సోమమ్మకు దివ్యాంగుడైన వెంకన్న (46) ఒక్కగానొక్క కుమారుడు. ఇతడికి చిన్ననాటి నుంచి మతిస్థిమితం సరిగా లేదు. కొన్నేళ్ల కిందటి వరకు కులవృత్తి (బుట్టలు అల్లడం) చేసుకుంటూ జీవనం సాగించారు. ప్రస్తుతం వృద్ధురాలైన సోమమ్మ, కదలలేక ఏ పనీ చేయలేని వెంకన్న ఆసరా పింఛన్ డబ్బులతో పొట్టపోసుకుంటున్నారు. ఈమె భర్త గతంలో అనారోగ్యంతో మరణించాడు. సోమమ్మ దివ్యాంగుడైన కుమారుడు వెంకన్నను చిన్న పిల్లాడిలా సాకుతూ వస్తోంది.


కుమారుడికి అన్నం తినిపిస్తున్న తల్లి సోమమ్మ

ఆరు మాసాల క్రితం..

ఆరు నెలల కిందట వెంకన్నకు కిడ్నీల సమస్య ఏర్పడింది. అప్పటి నుంచి ఖమ్మంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నారు. ఇప్పటి వరకు అప్పులు తెచ్చి సుమారు రూ.70 వేల వరకు ఖర్చు చేశారు. రెండు కిడ్నీలలో 19 ఎంఎం, 18ఎంఎం రా ళ్లు ఏర్పడ్డాయి. కిడ్నీలలో పెద్ద సైజు రాళ్లు ఏర్పడటంతో ఆరోగ్యశ్రీలో వైద్యం వర్తించదని ఆ ఆస్పత్రి డాక్టర్లు తేల్చిచెప్పారు. ప్రైవేట్‌గానే వైద్యం చేయించుకోవాలని సూచించారు. స్టంట్ వేసి కిడ్నీలకు ఆపరేషన్‌చేసి రాళ్లు తొలగించాల్సి ఉంటుందని, ఇందుకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతాయని వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.

సాయం చేయాలనుకుంటే..
సోమమ్మ బంధువు నవీన్ ఎస్‌బీఐ
ఖాతా నంబర్: 40655982787
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్ 0018872
ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంలు 9912601454

ఆపరేషన్ చేయించుకోక పోతే..

రెండు కిడ్నీలలో రాళ్లు పెరగడం, కిడ్నీలు ఇన్‌ఫెక్షన్‌కు గురికావడంతో వారం రోజుల్లో ఆపరేషన్ చేయించుకోవాలని, లేకుంటే రెండింటినీ తొలగించాల్సి వస్తుందని డాక్టర్లు చెప్పడంతో తల్లీకుమారుడు కన్నీరుమున్నీరవుతున్నారు. ఆసరా పింఛన్‌తోనే తమ కుటుంబం గడుస్తుందని, ఆపరేషన్‌కు పైసా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాతలు ఆదుకొని ఆపరేషన్‌కు సాయమందించాలని కోరుతున్నారు.

దాతలు ఆదుకోవాలి



నేను దివ్యాంగుడిని. ఆరు నెలల నుంచి కిడ్నీల వ్యాధితో బాధపడుతున్నా. ప్రస్తుతం రెండు కిడ్నీల్లో రాళ్లు పెరిగి పెద్దవయ్యాయి. వారం రోజుల్లో ఆపరేషన్ చేయించుకోకపోతే కిడ్నీలు తొలగించాలని డాక్టర్లు చెప్పారు. దాతలు ఆదుకొని నా ప్రాణాలు కాపాడాలి.
– వెంకన్న, కిడ్నీ బాధితుడు, అర్వపల్లి

నా కొడుకును బతికించండి



నా కొడుకుకు మతి స్థిమితం సరిగా లేక చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు కంటికిరెప్పలా సాకుతున్నా. దీనికి తోడు ఆరు నెలల క్రితం కిడ్నీల రోగం వచ్చింది. డాక్టర్లు ఆపరేషన్ చేయించకపోతే బతకడని చెప్పారు. ప్రభుత్వం, దాతలు ముందుకొచ్చి నా కొడుకును బతికించాలి.
– పెరసాని సోమమ్మ, అర్వపల్లి

ఒక్కరోజు ఎస్ఐ స్వాతి.. ఇక లేదు

- క్యాన్సర్‌తో పోరాడి మృత్యుఒడికి

చివ్వెంల(సూర్యాపేట) : ఒక్కరోజు ఎస్ఐగా విధులు నిర్వహించిన ధరావతు స్వాతి ఇక లేదు. కొంత కాలంగా ప్రాంక్రియాటిస్ క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆమె గురువారం రాత్రి తుదిశ్వాస విడిచింది. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని జగనాతండాకు చెందిన ధరావతు స్వాతి (23) డిగ్రీ చదువుతూ కేన్సర్ బారినపడింది. దీంతో ఆమె చిరకాల కోరిక ఎస్ఐ కావాలని ఉండటంతో తల్లిదండ్రులు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని కలిశారు. తమ కూతురు కోరికను తీర్చాలని కోరారు. స్పందించిన ఆయన ఒక్కరోజు ఎస్ఐగా విధులు నిర్వహించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మేక్ ఏ విష్ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ఆమెను చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో ఒక్క రోజు ఎస్ఐగా విధులు నిర్వహించేలా నియమించారు. దీంతో ఆమె జూన్ 6వన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించి విధులు నిర్వహించారు. అనంతరం క్యాంపు కార్యాలయానికి వెళ్లి మంత్రి జగదీష్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. స్వాతి మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.


స్వాతికి ఎస్ఐగా బాధ్యతలు అప్పగిస్తున్న ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ (ఫైల్)

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

భువనగిరి : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి పట్టణంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుతాడి గోపి కృష్ణ(35) మూడు నెలలుగా పట్టణంలోని మారుతీ సుజుకీ పవన్ కార్ల షో రూమ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా విధులు నిర్వహించేందుకు ఈ నెల 3న ఉదయ షో రూమ్‌కు వెళ్లాడు. రాత్రికి ఇంటికి వెళ్లాల్సి ఉంది. కానీ, మరుసటి రోజు ఇంటి వద్ద పని ఉందని రాత్రి విధులు నిర్వహించేందుకు వచ్చిన మరో సెక్యూరిటీ గార్డుకు చెప్పి తానే రాత్రి డ్యూటీ కూడా చేశాడు. ఉదయం విధులు నిర్వహించేందుకు మరో సెక్యూరిటీ గార్డు వచ్చే సరికి షోరూమ్ గేటు మూసి ఉంది. ఎంత పిలిచినా గోపి కృష్ణ రాకపోవడంతో షోరూమ్ యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న యాజమాన్యం సిబ్బందిని గేటుపై నుంచి వెళ్లాలని సూచించారు. వారు లోనికి వెళ్లి చూడగా అప్పటికే గోపికృష్ణ కారు సీటులో కూర్చొని మృతిచెందినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. గోపికి మూర్ఛ వ్యాధి ఉంది. అనారోగ్య సమస్య, లేదా మరో కారణమా అనే పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.గోపికృష్ణకు భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధీర్ కృష్ణ తెలిపారు.


గోపికృష్ణ(ఫైల్)

వందేభారత్ రైలుపై రాళ్లు విసిరిన ముగ్గురి అరెస్ట్

మిర్యాలగూడ అర్బన్: వందేభారత్ రైలుపై రాళ్లు విసిరిన ముగ్గురిని శుక్రవారం రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎంగ్లి, ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ నెల 2న రాత్రి 9:22 గంటల సమయంలో వందే భారత్ రైలు మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రాగానే సీ11 నంబర్ కోచ్ 3, 4 నంబర్ అద్దాలపై రాళ్లు విసరటంతో పగిలిపోయాయి. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎవరికీ గాయాలు కలేదు. రాళ్ల దాడిని గుర్తించిన రైల్వే సిబ్బంది నల్లగొండ స్టేషన్‌లో రైలు నిలిపిన సమయంలో పంచనామా చేసి విచారణ చేపట్టారు. ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రైలులోని సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు స్థానికంగా తనిఖీలు చేపట్టి ముగ్గురు నిందితులను గుర్తించారు. మధ్యప్రదేశ్ నుంచి రైస్ మిల్లుల్లో పనికోసం వచ్చి మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మనోజ్, అభిషేక్, యశ్వంత్‌మీనాలు రాళ్లు విసిరినట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నిందితులు నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ అశ్వినికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

చెరువులో మునిగి వ్యక్తి మృతి

నిడమనూరు: చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతిచెందాడు. నిడమనూరులో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన వీరమల్ల వెంకన్న (63) గురువారం సాయంత్రం 5గంటల సమయంలో చేపలు పట్టేందుకు తెప్పపై స్థానిక చెరువులోకి వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో గాలివాటానికి తెప్ప తిరగబడడంతో వెంకన్న నీటిలో పడిపోయాడు. అతడి కాళ్లకు వల చిక్కుకోవడంతో నీట మునిగిపోయాడు. గమనించిన తోటి జాలర్లు వచ్చే సరికి వెంకన్న మృతిచెందాడు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వీరమల్ల శ్రీకాంత్ శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.


నిడమనూరు చెరువులో తెప్పపై వెంకన్న మృతదేహం

ప్రమాదంగా చిత్రీకరించారంటూ..

వీరమళ్ల వెంకన్న గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందగా ఇన్సూరెన్స్ కోసం ప్రమాదంలో మృతిచెందినట్లు చిత్రీకరించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ముఠామేస్త్రీ దారుణ హత్య

- బండరాయితో తలపై మోది ఘాతుకం
- హతుడి బైక్ డిక్కీలో కనిపించని రైతుల వద్ద వసూలు చేసిన రూ.లక్షలు
- డబ్బుల కోసమే అంతమొందించి ఉంటారని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
- రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామ శివారులో దారుణం

రామన్నపేట : వ్యవసాయ పనులకు కూలీలను సమకూర్చే ముఠామేస్త్రీ దారుణహత్యకు గురయ్యాడు. రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామ శివారులో శుక్రవారం ఈ ఘటన వెలుగు చూసింది. హత్యోదంతంపై పరిసర గ్రామాల ప్రజలు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కాసరబాద సమీప గ్రామం జమునానగర్‌కు చెందిన వానరాశి లింగయ్య(50) వ్యవసాయం, ఇతర పనులకు కూలీలను సమకూరుస్తూ ముఠామేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. తనకు అందుబాటులో ఉన్న కూలీలను పని లభించే ప్రాంతానికి తీసుకువెళ్లి ఉపాధి కల్పిస్తుంటాడు. సుమారు 35రోజుల క్రితం లింగయ్య తన కుటుంబ సభ్యులతో పాటు మరో 40మంది కూలీలతో రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామానికి వచ్చాడు. అక్కడే ఓ రైతుకు చెందిన కోళ్లఫారంలో ఉంటూ నిదానపల్లి, తుమ్మలగూడెం గ్రామాల్లో పలువురి రైతులకు చెందిన పొలాల్లో వరినాట్లు వేయించాడు.


లింగయ్య(ఫైల్)


లింగయ్య మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పోలీసులు

కూరగాయలు తీసుకొని వెళ్తుండగా..

నాటు వేసే పనులు దగ్గర పడుతుండడంతో కూలీలకు కూలి డబ్బులు చెల్లించడానికి లింగయ్య రైతుల వద్ద నుంచి రావలసిన బకాయిలను వసూలు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. గురువారం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన కొందరు రైతుల వద్ద రూ.3లక్షల వరకు వసూలు చేశాడు. అనంతరం లింగయ్య నిదానపల్లిలోని ఓ కిరాణషాపులో కూరగాయలు తీసుకొని తన టీవీఎస్ ఎక్సెల్‌పై చిట్యాల–భువనగిరిరోడ్డు నుంచి కూలీలు ఉండే చోటుకు బయలుదేరాడు. నిదానపల్లి శివారుకు వెళ్లగానే దుండగులు అతడి తలపై బండరాయితో మోదడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. అనంతరం దుండగులు అతని బైక్ డిక్కీలో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లారు. బయటికి వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం పొద్దుపోయే వరకు రాకపోవడంతో కుటుంబసభ్యులు, కూలీలు అతడికి ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియలేదు. అదేరోజు రాత్రి లింగయ్య కుమారుడు మహేష్ తన తండ్రి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డబ్బుల కోసమే..?

లింగయ్యతోపాటు వచ్చిన కూలీలు తెల్లవార్లు అతని కోసం చెట్టుచేమా వెదికారు. శుక్రవారం ఉదయం 7గంటల సమయంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన తుమ్మలగూడేనికి చెందిన పవన్‌కు తమ పొలం సమీపంలో మృతదేహాన్ని చూసి గ్రామస్తులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. బండరాయితో తల,వీపుపై బలంగా మోదిన ఆనవాళ్లను గుర్తించారు. భువనగిరి నుంచి క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. రైతుల నుంచి వచ్చిన కూలి డబ్బులు మొత్తం అతడి వద్ద రూ.10 నుంచి రూ.12లక్షల వరకు ఉంటాయని కూలీలు, కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఆ డబ్బుల కోసమే దుండగులు లింగయ్యను హత్య చేసి ఉంటారని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మృతుడికి భార్య సైదమ్మతోపాటు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర, ట్రైనీ ఐపీఎస్ శివం ఉపాధ్యాయ, ఏసీపీ మొగులయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారివెంట సీఐ మోతీరాం, ఎస్ఐలు లక్ష్మయ్య, ప్రభాకర్ ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించి, హతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పిల్లాపాపలను వదిలి పొట్టచేతపట్టుకుని వస్తే అన్నంపెట్టే దేవుడిని హత్య చేశారని కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు.

చికిత్స పొందుతున్న వీఆర్ఏ మృతి

డిండి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీఆర్ఏ మృతిచెందాడు. డిండి మండల కేంద్రానికి చెందిన పోలం శేఖర్ (23) గత నెల 4న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పని ముగించుకొని సాయంత్రం తన బైక్‌పై ఇంటికి బయలు దేరాడు. ఈ క్రమంలో డిండి పట్టణంలోని యూనియన్ బ్యాంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో బైక్ పైనుంచి రోడ్డుపై పడిన శేఖర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శేఖర్ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తల్లి నారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

మహిళ అదృశ్యం

మునుగోడు: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటన మునుగోడు మండలం పలివెల గ్రామంలో ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పలివెల గ్రామానికి చెందినా రేరంగుల బక్కమ్మకు ముగ్గురు ఆడపిల్లల సంతానం. అందరికీ వివాహాలు చేసింది. రెండో కుమార్తె సబిత రెండు నెలల క్రితం తన భర్తతో తగువుపడి పలివెల గ్రామానికి వచ్చింది. ఈ విషయంలో తల్లీకుమార్తెల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన బక్కమ్మ ఈ నెల 2న ఇంటి నుంచి వెళ్లిపోయి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ఆమె కుటుంబ సభ్యులు తమ బంధువులు, చుట్టూ పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం కుమార్తె సబిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.


బక్కమ్మ (ఫైల్)

విద్యుదాఘాతంతో జేఎల్ఎం మృతి

- ఒక ఫీడర్‌కు బదులు మరో ఫీడర్‌కు ఎల్‌సీ ఇవ్వడమే ప్రమాదానికి కారణం

పెద్దవూర: విద్యుదాఘాతంతో జేఎల్ఎం మృతిచెందాడు.ఈ ఘటన పెద్దవూర మండలం జయరాంతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం మాటూరు గ్రామపంచాయతీ దుబ్బతండాకు చెందిన వాంకుడోతు గోపి(30) నాలుగేళ్లుగా పర్వేదుల సబ్‌స్టేషన్‌లో జేఎల్ఎంగా పనిచేస్తున్నాడు. శుక్రవారం జయరాం తండా రైతుల పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయడం లేదని, పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. దీంతో గోపి సాయంత్రం నాలుగు గంటల సమయంలో పర్వేదుల సబ్‌స్టేషన్‌లో అక్కడున్న విద్యుత్ ఆపరేటర్‌ను ఎల్‌సీ అడిగాడు. అతను ఒక ఫీడర్ బదులు మరో ఫీడర్‌కు ఎల్‌సీ ఇచ్చాడు. గోపికి ఎల్‌సీ ఇచ్చానని చెప్పడంతో మరమ్మతులు చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ముట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. జేఎల్ఎంలు పనిరాని వారిని ఒకరిబదులు మరొకరిని సబ్‌స్టేషన్లలో పెట్టుకుంటున్నారని అందుకే పలుచోట్ల ప్రమాదాలు జరిగి మరణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపించారు.


గోపి (ఫైల్)

ఎర్రవరంలో బైక్‌ల అపహరణ

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరంలోని దూళ్లగుట్ట శ్రీబాల ఉగ్ర నరసింహస్వామి ఆలయం వద్ద దుండగులు బైక్‌లను అపహరిస్తున్నారు. భక్తులు ఆలయానికి వేలాదిగా వస్తున్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో ఆలయానికి దూరంగా వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో భక్తులు వాహనాలను పార్కింగ్ చేసి దర్శనానికి వెళ్లి వచ్చే వరకు బైక్‌లు మాయం అవుతున్నాయి. ఇప్పటి వరకు 4 బైక్‌లను దొంగలు చోరీ చేశారు. గురువారం ఓ వ్యక్తి బైక్‌ను అపహరిస్తుండగా స్థానికులు పట్టుకొని స్టేషన్‌లో అప్పగించారు. ఈ ఘటనలపై బాధితులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పంటల సాగులో ఎరువుల వాడకమే కీలకం

- పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్



పెద్దవూర : పంటల సాగులో ఎరువుల వాడకమే కీలకమని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ పేర్కొంటున్నా రు. ఏయే దశల్లో ఎంత మోతాదులో ఏయే ఎరువులు వాడాలనే విషయంపై రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు. ఎరువుల వినియోగంలో రైతులు పాటించాల్సిన పద్ధతులను ఆయన వివరించారు.


పెద్దవూరలో పత్తి చేనులో కాంప్లెక్స్ ఎరువులు వేస్తున్న రైతు

పాడి పంట

రసాయనిక ఎరువులతో నష్టం

రసాయనిక ఎరువుల వాడకం శ్రేయస్కరం కాదు. దీనివలన పెట్టుబడులు పెరగడమే కాకుండా భూసారంలో మార్పులు సంభవిస్తాయి. మరో వైపు పంట ఉత్పత్తులలో రసాయనిక అవశేషాలు మిగిలి ఉండి మార్కెట్లో దాని ప్రభావంతో డి మా ండ్ తగ్గి ధరలు కూడా పడిపోయే ప్రమాదం ఉంది. క్రమేపీ పంట దిగుబడులు కూడా తగ్గుతాయి.

ఎరువుల వాడకంలో పాటించాల్సిన పద్ధతులు

- లోతు దుక్కుల వలన భూమి పొరలు గుల్లబారి తేమను బాగా నిల్వ ఉంచుకుంటాయి. వేసిన ఎరువును ఎక్కువ శాతం మొక్కలు తీసుకుంటాయి.
- పంటలో ఉన్న కలుపును పూర్తిగా తొలగించిన అనంతరం తేమ ఉన్న దశలోనే ఎరువులు చల్లుకోవాలి.
- సమస్యాత్మక భూముల్లో ముందుగా ఉన్న సమస్యను సరిచేసుకుని ఆ తర్వాత ఎరువులు వేసుకుంటే వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.
- అన్ని పోషకాల్లో నత్రజని పోషకం వృథా ఎక్కువగా ఉంటుంది. యూరియాను వేప పిండితో కలిపి, యూరియా ఎరువుతో వేప నూనె కలుపుకుని వాడితే నత్రజని నెమ్మదిగా విడుదలవుతుంది.
- కోల్‌థార్‌తో 2 లీటర్ల కిరోసిన్‌తో మిశ్రమం చేసి రెండు బస్తాల యూరియాలో కలిపితే మంచి ఫలితాలు వస్తాయి. అర బస్తా యూరియాను ఒక బస్తా తడి, పొడి మట్టితో కలిపి 24 గంటలు నీడలో ఉంచి ఆ తర్వాత నేలకు అందిస్తే వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

సేంద్రియ ఎరువులు మేలు

సేంద్రియ ఎరువుల వాడకం మూలంగా అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఉంది. నేలకు సేంద్రియ పదార్థాలు జీవం వంటివి. సేంద్రియ ఎరువు ల వలన అన్ని రకాల పంటలకు పోషకాలు అందుతాయి. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని సొంతంగా వాటిని తయారు చేసుకో వడం ద్వారా పెట్టుబడులు తగ్గుతాయి. పశువుల ఎరువు, కంపోస్టు, ఫిల్టర్ మడ్డి, పచ్చిరొట్ట ఎ రువులు, వ్యవసాయ వ్యర్థ పదార్థాల వాడకం, జీవన ఎరువుల వాడకం ప్రాధాన్యతను గుర్తించాలి.

పాదుల్లో ఎరువు వేసే పద్ధతి

మొక్కల దగ్గర ఎరువులు వేసే పద్ధతి ద్వారా పోషక వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. వృథా కూడా తగ్గుతుంది. నిర్ణీత వరుసల్లో మొక్కలు ఉన్నప్పుడు పొలాన్ని 2 అంగుళాల మేర లోతు చేసుకుని తేమ ఉన్నప్పుడు మొక్కల మొదళ్ల దగ్గర ఎరువు పడేలా వేయాలి. చిన్నపాటి గుంతలు తీసి ఎరవులు వేసిన సమయంలో దానిని మట్టితో కప్పేలా చేసుకోవాలి.

వెదజల్లే పద్ధతి.. ప్రయోజనాలు

సరైన పద్ధతిలో ఎరువులు వేయడం ముఖ్యం. సాధారణంగా ఎరువులను రెండు పద్ధతుల్లో వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో మొక్కలు దగ్గర దగ్గరగా ఉంటే మేలు జరుగుతుంది. వరుస క్రమంలో లేని మొక్కలకు, వేళ్లు భూమిలో అల్లుకుపోయే పైర్లకు ఈ పద్ధతి అనుకూలంగా ఉంటుంది. వరికి కూడా ఈ పద్ధతి మేలు చేస్తుంది.

ఏ దశలో, ఏ సమయంలో ఎరువులు వాడాలంటే..

పంటలకు నత్రజని అవసరం చివరి దశ వరకు ఉంటుంది. నత్రజని ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులో రెండు మూడు కీలక దశల్లో వాడుకోవాలి. ఏపుగా పెరిగేందుకు, పూత, మొగ్గ దశ, పంట దిగుబడి పెరిగే దశల్లో ప్రధానంగా వాడుకోవాలి. నత్రజనిని యూరియా రూపంలో వాడే సమయంలో వృథాని అరికట్టడానికి పైన చెప్పిన మిశ్రమాలను ఉపయోగించాలి. భాస్వరం ఎరువును మొత్తం మోతాదును విత్తే సమయంలో చివరి దుక్కిలో వేసుకోవాలి. దీంతో ఎరువు భూమిలో నిల్వ ఉండి కొద్దికొద్దిగా పంటకు అందుతుంది. పొటాష్ ఎరువులు మొక్కలో రోగ నిరోధక శక్తిని పెంచటంతో పాటు నాణ్యత కలిగిన ఉత్పత్తి వచ్చేలా చేస్తాయి.